మరోసారి లబ్ధిదారుల వివరాల సేకరణ

● కేంద్ర ప్రభుత్వ యాప్‌లో నమోదు కోసమే
● ఫొటోలతోపాటు ఇతర సమాచారం అప్‌లోడ్

రఘునాథపల్లి: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాలు మరోసారి సేకరిస్తున్నారు. ఇప్పటికే ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల ఫొటోలు, ఇతర సమాచారం పంచాయతీ కార్యదర్శులు తీసుకుంటున్నారు. ఇళ్ల ప్రొసీడింగ్స్ ఇచ్చిన అనంతరం మళ్లీ వివరాల సేకరణ ఎందుకనుకుంటున్నారా ..? ఇప్పుడు సేకరించే సమాచారం కేంద్ర ప్రభుత్వ పోర్టల్‌లో నమోదు చేసేందుకు. ప్రధాన మంత్రి అవాస్ గ్రామీణ్ యోజన (పీఎంఏజీవై)లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్మించే ఇళ్లకు తమ వంతు వాటాగా కేంద్ర సర్కార్ రూ 1.03,000 నిధులు ఇవ్వనుంది, మిగతా రూ 3,97,000 రాష్ట్ర ప్రభుత్వం ఇస్తోంది. లబ్ధిదారుల వివరాలు నమోదు యాప్‌లో నమోదు చేస్తేనే కేంద్ర సర్కార్ నిధులు విడుదల చేయనుంది. ఇందులో భాగంగా లబ్ధిదారుల సమాచారం సేకరించి పంచాయతీ కార్యదర్శులు కేంద్ర ప్రభుత్వ పీఎంఏజీవై మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. లబ్ధిదారులు, ఇంటి నిర్మాణ ఫొటోలు,


ఇబ్రహీంపూర్‌లో లబ్ధిదారుల వివరాలు సేకరిస్తున్న జీపీ కార్యదర్శి నర్సింహ

ఆధార్, ఇతరత్రా 40 రకాల ప్రశ్నలకు వివరాలు సేకరిస్తున్నారు. గతంలో సర్వే నిర్వహించి లబ్ధిదారుల ఎంపిక చేయగా, ఇప్పుడు మళ్లీ వివరాలు సేకరించడం అదనపు భారమని, సాంకేతిక సమస్యతో జాప్యం జరుగుతుందని పలువురు పంచాయతీ కార్యదర్శులు అభిప్రాయపడుతున్నారు. మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లో కన్నాయపల్లి గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని ప్రభుత్వం 43 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసింది. రెండో విడతలో 518 ఇళ్లు మంజూరయ్యాయి. వాటిలో తొమ్మిది మంది తాము ఇళ్లు కట్టుకోమని లిఖిత పూర్వకంగా రాసి ఇవ్వడంతో వారి ఇళ్లు రద్దు చేశారు.

31వ తేదీ లోపు వివరాల సేకరణ



కేంద్ర ప్రభుత్వ నిధుల కోసం పీఎంఏజీవై పోర్టల్‌లో వారం రోజులుగా మండలంలో పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల సమాచార సేకరణ మొదలైందని, ఒకటి, రెండు రోజుల్లో పూర్తవు తుందన్నారు. మండలానికి మంజూరైన 561 ఇళ్లలో 9 రద్దు కాగా 512 ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయని, మరో 49 ప్రారంభం కావాల్సి ఉందన్నారు.

- గార్లపాటి శ్రీనివాసులు, ఎంపీడీఓ రఘునాథపల్లి

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి


బచ్చన్నపేట: పుట్ట వద్ద పూజ చేస్తున్న మహిళలు


జనగామ: పోచమ్మ ఆలయంలో..


జనగామ: ఉమామహేశ్వర స్వామి ఆలయంలో.

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా మంగళవారం నాగులపంచమి వేడుకలను భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మహిళలు పుట్టలో పాలు పోసి దేవతామూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పాడిపంటలు సమృద్ధిగా పండి, పిల్లాపాపలతో చల్లంగా ఉండేలా చూడాలని మహిళలు నాగమయ్యను వేడుకున్నారు.


నర్మెట: సుబ్రహ్మణ్యస్వామికి పూజ చేస్తున్న భక్తులు


పాలకుర్తిటౌన్: ఆంజనేస్వామి ఆలయంలో..

వృద్ధాప్యంలో చట్ట ప్రకారం పోషించేలా చూడండి

● కలెక్టర్‌కు ఓ తల్లి వేడుకోలు

జనగామ: వృద్ధాప్యంలో చట్ట ప్రకారం పోషించేలా న్యాయం చేయాలని కోరుతూ జిల్లాకేంద్రానికి చెందిన వృద్ధురాలు పగిడిపాటి ఎలిజిబెత్ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు మొరపెట్టుకున్నారు. తనకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారన్నారు. రెక్కల కష్టంతో పిల్లలను పోషించి ఉన్నతస్థితికి తీసుకువచ్చానని పేర్కొన్నారు. రెండవ కుమారుడు పగిడిపాటి సురేష్ సుగుణాకర్‌రాజు 35 ఏళ్ల క్రితం వివాహం చేసుకుని వెళ్లిపోగా, మరో కుమారుడు అమెరికాలో స్థిరపడినట్లు తెలిపారు. వృద్ధాప్యంలో తనను ఇద్దరు కొడుకులు పట్టించుకోకుండా వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పోషణ కోసం కొడుకులను నిలదీస్తే తండ్రి రిటైర్డ్ అయిన తర్వాత వచ్చే పింఛన్ వస్తుందని నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. తాను బతికి ఉండగానే తన పేరిట ఉన్న ఇంటిని తప్పుడు ధ్రువపత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకున్నారని కలెక్టర్‌కు వివరించారు. అనేక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న తనను పెద్ద కుమారుడు డాక్టర్ కరుణాకర్‌రాజు, మనువళ్లు చేరదీస్తున్నారన్నారు. తాను బతికి ఉన్నంత కాలం ఇంటిని తనకు చెందేలా చూడాలని, వృద్ధ తల్లిదండ్రుల పోషణ చట్ట ప్రకారం జరిగేలా న్యాయం చేయడంతోపాటు ఇద్దరు కుమారులను పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వాలని వేడుకున్నారు.


కలెక్టరేట్‌లో ఎలిజిబెత్

కన్నతల్లికి అన్యాయం చేసేంత సంస్కారం లేని వ్యక్తిని కాను : డాక్టర్ సుగుణాకర్‌రాజు

కన్నతల్లి ఎలిజిబెత్ కలెక్టరేట్‌లో తనపై చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని సుగుణాకర్‌రాజు తెలిపారు. సోదరుడు ఆస్తులను దక్కించుకునే కుట్రలో భాగమే తనపై ఇలాంటి తప్పుడు ప్రకటనలు చేయిస్తున్నారని చెప్పారు. తల్లి మరణ ధ్రువీకరణ పత్రం సృష్టించి తప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకున్నానని చేసిన ఆరోపణల్లో ఏ మాత్రం నిజం లేదని పేర్కొన్నారు. కన్నతల్లికి అన్యాయం చేసేంత సంస్కారహీనుడిని కానని తెలిపారు.

క్లుప్తంగా

మార్కెట్ అభివృద్ధికి కృషి

● చైర్మన్ ఆండాళ్


మాట్లాడుతున్న మార్కెట్ చైర్మన్ ఆండాళ్

కొడకండ్ల: కొడకండ్ల వ్యవసాయ మార్కెట్‌లో రైతుల అవసరాలకనుగుణంగా సౌకర్యాలు కల్పించి మార్కెట్ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తామని మార్కెట్ చైర్మన్ నల్ల ఆండాళు శ్రీరామ్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని మార్కెట్ కమిటీలో నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో చైర్మన్ మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినపుడు సరైన వసతులు లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి సహకారంతో అవసరమైన వసతుల కల్పన కోసం కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో డీఎంఓ, ఇన్‌చార్జ్ కార్యదర్శి నాగేంద్ర, వైస్ చైర్మన్ ఈరంటి సాయికృష్ణ, డైరెక్టర్‌లు నాగరాజు, వెంకన్న, రమేష్, వెంకట్ రెడ్డి, యాకూబ్‌నాయక్, క్రాంతికుమార్, మోహన్, పూర్ణచందర్, మదన్‌మోహన్‌రెడ్డి, ఈదయ్యలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది


మూర్తిని సన్మానిస్తున్న ఎంఈఓ తదితరులు

బచ్చన్నపేట: ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనదని మండల విద్యాధికారి ఇర్రి వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని లిఖ్రా గార్డెన్‌లో పోచన్నపేట పాఠశాల హెచ్ఎం డీవీఎల్ఎన్ మూర్తి పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఈఓ ముఖ్య అతిథిగా విచ్చేసి ఉపాధ్యాయులు, గ్రామస్తులతో కలిసి మూర్తిని ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు ఝాన్సీ, రత్నాదేవి, సంధ్యారాణి, గిరీష్, స్పందన, మంజుల, అంజయ్య, బాలారెడ్డి, యాదగిరి, రాజ్ కుమార్, శశిధర్‌రాజు, శిరీష, కర్ణాకర్ , విద్యార్థులు పాల్గొన్నారు.

పరామర్శ



జఫర్‌గఢ్: మండలంలోని సూరారం గ్రామానికి చెందిన నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్‌కుమార్ తల్లి శాంతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా, విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి పార్టీ బృందంతో కలిసి మంగళవారం గ్రామానికి చేరుకుని సంతోష్‌కుమార్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా శాంతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మతిస్థిమితం లేని మహిళ ఆత్మహత్య


రేణుక (ఫైల్)

తరిగొప్పుల: మతిస్థిమితం లేని ఓ వివాహిత శరీరంపై డీజిల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని అబ్దుల్‌నాగారంలో చోటు చేసుకుంది. ఎస్సై గుగులోత్ శ్రీదేవి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తీగుల్ల రేణుక (46)కొంతకాలం క్రితం మతిస్థిమితం కోల్పోయింది. కాగా, మృతురాలి భర్త రవి వ్యవసాయ పనుల నిమిత్తం ప్లాస్టిక్ క్యాన్‌లో డీజీల్ ఇంట్లో భద్రపరిచాడు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి కుటుంబ సభ్యులు నిద్రలో ఉండగా రేణుక క్యాన్‌లోని డిజీల్‌ను మరో సీసాలో పోసుకుని ఇంటి ఎదుటకు వచ్చి శరీరంపై పోసుకుని నిప్పంటించుకుంది. గమనించిన స్థానికులు మంటలు ఆర్పి తీవ్రంగా గాయపడిన రేణుకను వరంగల్ ఎంజీఎం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. ఈ ఘటనపై మంగళవారం మృతురాలి భర్త రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని సముద్రాల గ్రామానికి చెందిన కత్తుల యాదగిరి(55) ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సముద్రాలకు చెందిన యాదగిరి రెండు వారాల క్రితం అదేగ్రామానికి చెందిన ఓ వ్యక్తితో గొడవపడగా తలకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడ్డ వ్యక్తి అపస్మారక స్థితికి చేరుకోగా ముందుగా హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో ఇటీవల వరంగల్ ఎంజీఎంకు తరలించారు. కాగా, చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు.

విద్యార్థుల ప్రగతికి నూతన విద్యావిధానం దోహదం

స్టేషన్‌ఘన్‌పూర్: విద్యార్థుల ప్రగతికి నూతన విద్యావిధానం ఎంతగానో దోహదపడుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న అన్నారు. మండలంలోని నమిలిగొండ శివారులోని మోడల్ స్కూల్‌లో నూతన విద్యావిధానం (ఎన్ఈపీ-2020) ఐదవ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా డీఈఓ హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలను మెరుగుపరిచేందుకు ప్రవేశపెట్టిన పీఎంశ్రీలో 2025-26 విద్యాసంవత్సరానికి స్టేషన్‌ఘన్‌పూర్ మోడల్ స్కూల్ ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కొమురయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఈఓ భోజన్న

భక్తిశ్రద్ధలతో సీత్లా పండుగ

రఘునాథపల్లి: మండలంలోని కుసుంబాయితండా, జాల్‌తండాలో పశు సంపద, పిల్లా పాపలు సల్లంగా ఉండాలని తండావాసులు ఘనంగా సీత్లా మాత పండుగ జరుపుకున్నారు. మంగళవారం డప్పుచప్పుళ్లతో గిరిజన మహిళలు సాంప్రదాయ పద్ధతిలో నవదాన్యాలు నెత్తిన పెట్టుకొని తండా సమీపంలోని పచ్చిక బీడులోకి వెళ్లారు. అక్కడ సీత్లా మాతను అత్యంత భక్తిశ్రద్ధలతో పూజించి నైవేద్యం సమర్పించారు. వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని సీత్లా మాతను మొక్కుకున్నారు. ఈ సందర్భంగా యువతీ యువకులు నృత్యాలతో సందడి చేశారు. కొర్ర రాజేందర్‌నాయక్, రమాదేవి, బిచ్చ నాయక్, రవినాయక్, వశ్రీనాయక్, భీమా, జీనానాయక్, రామునాయక్ పాల్గొన్నారు.


చిల్పూరు: నైవేద్యంతో వెళ్తున్న గిరిజనులు

గార్లగడ్డతండాలో..

చిల్పూరు: గార్లగడ్డతండాలో సీత్లభవాని పండగను తండావాసులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భూక్య సంజీవనాయక్, రవి, పూజారి రాగ్య భోజ్యా, వెంకన్న, తిరుపతి, భీముడు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం గిరిజనుల ధర్నా

పాలకుర్తి టౌన్: తాగునీటి సమస్యను పరిష్కరించాలని టీఎస్‌కేతండా శివారు దుబ్బ తండాకు చెందిన గిరిజనులు మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా తండావాసులు దేవేందర్, వాసు, దేవా, లక్‌పతిలు మాట్లాడుతూ దుబ్బతండా ప్రజలు తాగునీరు అందించేందుకు చెరువు శిఖంలో బావిని తవ్వించారని తెలిపారు. బావి పక్కనే బోరు ఉండడంతో బావిలో నీళ్లు ఊరటం లేదని, బావి పక్కన ఉన్న బోరును సీజ్ చేసి బావిని వినియోగంలోకి తీసుకువచ్చి తాగునీరు అందించాలని అధికారులను కోరారు. తండావాసులు ధర్నా నిర్వహించడంతో తహసీల్దార్ నాగేశ్వరచారి, ఎంపీడీఓ రవీందర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సంధ్య, ఏపీ ప్రశాంతి దుబ్బతండాలో తాగునీటి బావిని సందర్శించి పరిశీలించి సమస్యపై కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని చెప్పారు. తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయచర్యలు చేపడుతామని వారు తెలిపారు.

ఆర్టీసీ ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసపత్రాలు

జనగామ: జనగామ ఆర్టీసీ సంస్థలో ప్రతిభ కనబరిచి డ్రైవర్, కండక్టర్లు, మెయింటెనెన్స్ విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు ప్రశంసపత్రాలు, నగదు బహుమతులను అందజేశారు. మంగళవారం డిపోలో జరిగిన కార్యక్రమంలో మేనేజర్ స్వాతి పాల్గొని ఉత్తమ ఉద్యోగులకు వాటిని అందజేసి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డిపోలో పని చేస్తున్న ప్రతీ ఉద్యోగి ఉత్తములను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిపో సూపర్ వైజర్ డి.హుస్సేన్, ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్ జి.రాఘవేంద్ర, మెకానికల్ విభాగం అసిస్టెంట్ ఇంజనీరు కె.రవీందర్, ఆఫీసు సూపరింటెండెంట్ వై.యాదమణి, సెక్యూరిటీ విభాగం హెడ్ కానిస్టేబుల్ వి.ప్రభాకర్, ఏడీసీలు ఉప్పలయ్య, ఎంబీకే రెడ్డి, ఆఫీస్ స్టాఫ్, గ్యారేజీ సిబ్బంది తదితరలు పాల్గొన్నారు.


ప్రశంసపత్రాలు అందుకున్న ఉత్తములతో స్వాతి

విజయవంతం చేయండి

జనగామ రూరల్: విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 1వ తేదీన యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూఎస్‌పీసీ జిల్లా స్టీరింగ్ కమిటీ నాయకులు చంద్రశేఖర్ రావు, ఎస్ఎస్ రాజు, డి. శ్రీనివాస్, శ్రీనివాసరావు, రాం రెడ్డి, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు చర్యలు తీసుకోవాలి

● అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్

దేవరుప్పుల: సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని కేజీబీవీ, పీహెచ్‌సీ, పోస్టాఫీసులను సందర్శించి జనగామ-సూర్యాపేట రహదారి పక్కన వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ వసతి గృహాలను పర్యవేక్షించాలన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. సీజనల్ వ్యాధులపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారి రవితేజను ఆదేశించారు. అలాగే పోస్టాఫీస్‌లో ఫించన్‌ల ఫొటో క్యాప్చర్ ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, ఉద్యాన శాఖ అధికారి బి.శ్రీధర్ రావు, జిల్లా బాలికల సంక్షేమ అభివృద్ధి అధికారి గౌసియా బేగం, ఎంపీడీఓటి సురేష్‌కుమార్, కేజీబీవీ ప్రత్యేక అధికారి సుకన్య, పోస్టుమాస్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.


పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న పింకేష్‌కుమార్

హెచ్‌టీ సర్వీసుల మంజూరుకు సింగిల్ విండో వ్యవస్థ

జనగామ రూరల్: వినియోగదారుల హెచ్‌టీ 11/33 కేవీ ఆపై ఓల్టేజీ సర్వీసుల మంజూరు వేగవంతం చేయడానికి సింగిల్ విండో వ్యవస్థ దోహదపడుతుందని విద్యుత్‌శాఖ జనగామ సర్కిల్ సూపరిటెండెంట్ టి.వేణుమాధవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓల్టేజీ సర్వీసుల మంజూరు మరింత సరళీకృతం చేయడానికి హెచ్‌టీ మానిటర్ సెల్‌ను సర్కిల్ ఆఫీస్, కార్పొరేట్ ఆఫీస్‌లో ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడి

నర్మెట: రైతులు సాగులో సకాలంలో సస్యరక్షణ చర్యలతో పాటు మెళకువలు పాటిస్తే సాగు ఖర్చులు తగ్గడంతోపాటు అధిక దిగుబడులు సాధించవచ్చని బేయర్ కంపెని వరంగల్ జిల్లా మేనేజర్ సతీష్ అన్నారు. కన్నెబోయిన గూడెంలో మంగళవారం ఏర్పాటు చేసిన రైతు అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బేయర్ కంపనీ నూతన ఉత్పాదన బికోటతో వరిపంటలో వచ్చే మొగి పురుగును పూర్తి స్థాయిలో నివారించవచ్చని అన్నారు. ఐదు కేజీల బికోటను 10 కేజీల సన్న యూరియాతో లేదా ఇసుకతో కలిపి నాటు వేసిన 15 రోజుల అనంతరం పొలంలో చల్లాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ అంబటి సోమయ్య, రైతులు పాల్గొన్నారు.


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మేనేజర్, రైతులు

సంక్షిప్త సమాచారం

బ్రిడ్జిలు నిర్మించాలి

జనగామ రూరల్: గానుగపహాడ్, చీటకోడూర్ బ్రిడ్జిలను తక్షణమే నిర్మించాలని మాజీ ఎంపీపీ మేకల కళింగ రాజు డిమాండ్ చేశారు. బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టాలని కలెక్టరేట్ ఎదుట బ్రిడ్జి నిర్మాణ సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన దీక్ష శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. మంగళంపల్లి రాజు, సాధన సమితి నాయకులు ఇరుగు సిద్దులు, యాసారపు కర్నాకర్, కొమ్ము రాజు, గండి నాగరాజు పాల్గొన్నారు.

టై, బెల్టుల పంపిణీ

కొడకండ్ల: మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు గిరగాని వేణు విద్యార్థులందరికి టై, బెల్టులను అందించగా, మంగళవారం హెచ్ఎం దోర్నం ప్రభాకర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పసునూరి ఉమేష్, వెంకటయ్య, కవితలు పాల్గొన్నారు.

డైరీల..

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ పాలకుర్తి ఆధ్వర్యంలో డైరీలను పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ చంద్రశేఖర్, లయన్స్ పాలకుర్తి అధ్యక్షుడు చారగోండ్ల ప్రసాద్, హెచ్ఎం శోభారాణి, క్లబ్ కార్యదర్శి దేవసాని కృపాకర్ పాల్గొన్నారు.

అశ్వరావుపల్లిలో భూ వివాదం

రఘునాథపల్లి: మండలంలోని అశ్వరావుపల్లిలో కొన్నాళ్లుగా భూ వివాదం కొనసాగుతుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మండలి ఎల్లయ్య సోమవారం కూలీలతో నాటు వేయిస్తుండగా అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అనుచరులు వెళ్లి నాటు వేయొద్దంటూ కూలీలను అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకోగా పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ఆ వ్యక్తి అనుచరులను అక్కడి నుంచి పంపించారు. కాగా, ఇరు వర్గాలు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాయి.

కారు అదుపు తప్పి మహిళకు గాయాలు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లిలో రైల్వేగేటు సమీపాన ఉన్న కూరగాయల మార్కెట్‌లోకి ఓ కారు అదుపుతప్పి దూసుకెళ్లగా అక్కడ పల్లికాయలు అమ్మే ఎల్లమ్మ అనే మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పాలకుర్తి నుంచి స్టేషన్‌ఘన్‌పూర్‌కు వచ్చే ఓకారు వేగంగా వచ్చి అదుపుతప్పి స్థానిక రైల్వేగేటు సమీపాన మార్కెట్ వద్ద పార్కింగ్ చేసి ఉన్న మరోకారును ఢీకొట్టింది. అనంతరం అక్కడే పల్లికాయలు అమ్ముకునే ఓ మహిళను ఢీకొట్టగా ఆమె తీవ్రంగా గాయపడింది. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకున్న బాధిత మహిళను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

దేవరుప్పుల: మండలంలోని వాగు పరివాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరంగా చర్యలు అనివార్యమని ఎస్సై ఊర సృజనకుమార్ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని దాదాసాహెబ్ కాలనీ నుంచి ఇసుక తరలిస్తున్న ఎస్.కె కరీమ్, ఎస్.కె సాల్ ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసి యజమానులపై కేసు నమోదు చేశామన్నారు. ఇందిరమ్మ, తదితర నిర్మాణాల పేరిట టోకెన్లు తీసుకుని దుర్వినియోగం చేసే ట్రాక్టర్ యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుళ్లు ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

దేవరుప్పుల: ధరావత్ తండాలో పేకాట ఆడుతున్న ఎడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై ఊర సృజన్‌కుమార్ తెలిపారు. మండలంలోని ధరావత్ తండా గ్రామంలో ధరావత్ సురేష్, రాజేష్, పెద్ద నరేష్ ,భాస్కర్, చిన్న నరేష్, రవి సోమన్న పేకాట ఆడుతున్న సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నారు. పేకాట ఆడే స్థలంలో రూ. 2,590 నగదు, పేకాట ముక్కలు స్వాధీన చేసుకుని వారినిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

దాడిలో వ్యక్తికి గాయాలు

బచ్చన్నపేట: మండలంలోని ఇటుకాలపల్లిలో భూతగాలలో దాడి చేయగా ఒకరు గాయపడిన సంఘటన మంగళవారం జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటుకాలపల్లి గ్రామంలోని వ్యవసాయ భూముల విషయంలో అత్కూరి లింగం, రాసూరి ఐలయ్యల మధ్య భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. కాగా, మంగళవారం లింగం ఇంటికి ఐలయ్య భార్య, మనుమడు వచ్చి గొడవ చేస్తూ లింగంపై దాడి చేయగా అతడు గాయపడ్డాడు. ఈ విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు లింగం తెలిపారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి

బచ్చన్నపేట: హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని తహసీల్దార్ రామానుజాచారి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వంట గదిని, స్టాక్ రూం, హాస్టల్ గదులను ఆయన పరిశీలించారు. పాఠశాల, హాస్టల్ పరిసరాలు, వంటగదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఎంఆర్ఐ వంశీకృష్ణ, హాస్టల్ వార్డెన్, వాచ్‌మెన్ తదితరులు ఉన్నారు.

విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం

రఘునాథపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు అన్నారు. మంగళవారం ఖిలాషాపూర్ ఉన్నతపాఠశాలలో హెచ్ఎం డాక్టర్ భారత రవీందర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులతో కలిసి ఆయన ఓపెన్ స్కూల్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. స్టాఫ్ కార్యదర్శి ఎం శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రమేష్, శ్రీనివాసులు, శ్రీనివాస్‌రెడ్డి, ప్రసన్నరాణి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, మార్కెట్ డైరెక్టర్ ఎండి బాషుమియా, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసి పనిచేయాలి

పాలకుర్తి టౌన్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం గ్రామస్థాయిలో కార్యకర్తలు కలిసి పని చేయాలని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు హనుమండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల, గ్రామ పార్టీ, యూత్ అధ్యక్షులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సత్యనారాయణ, కుమారస్వామి, మంజుల పాల్గొన్నారు.

డీలర్ల సంక్షేమానికి పాటుపడాలి

దేవరుప్పుల: చాలీచాలని కమీషన్లతో నిత్యం ప్రజా పంపిణీ కోసం పాటుపడుతున్న రేషన్ డీలర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం పాటుపడాలని రేషన్ డీలర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దుగ్గింపుడి కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని రేషన్ దుకాణం-19 సీనియర్ డీలర్ వర్దమాను రాములు అకాల మృతి చెందగా ఆయన మండల ప్రతినిధులు పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. మృతుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఒకరికి డీలర్‌షిప్ వెంటనే కేటాయించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రీయ కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలి

రఘునాథపల్లి: జిల్లా కేంద్రంలో రైతుల కోసం రాష్ట్రీయ కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలని మండలంలోని కన్నాయపల్లి గ్రామానికి చెందిన ఆర్ఈఏసీ సభ్యుడు మంతపురి యాదగిరి జాతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ షేక్ మీరాను కలిసి విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో కేంద్ర డైరెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

జనగామ రూరల్: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు డీసీఓ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్- బాలురు, పాలకుర్తి, జఫర్‌గఢ్ -బాలికల విద్యాలయాల్లో ప్రవేశానికి పరిమిత సీట్లు ఉన్నాయన్నారు. ఎంపీసీ, బైపీసీ లో ఈనెల 31వ తేదీన సంబంధిత కళాశాలల వద్ద స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. టీసీ, బోనఫైడ్, కుల, ఆదాయ, రేషన్‌కార్డు, పదో తరగతి మార్కుల మెమో మూడు జిరాక్స్ సెట్లు, మూడు పాస్‌పోర్టు ఫొటోలతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు జనగామ- 9704550186, 9704550190, జఫర్‌గఢ్- 9704550200, పాలకుర్తి-9000057201 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

జనగామ రూరల్: మండలంలోని చౌడారం తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఖాళీగా ఉన్న సీట్ల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ కె.సుధీర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ఫొటోగ్రాఫర్స్ కార్యవర్గం ఎన్నిక

రఘునాథపల్లి: మండలంలోని ఫొటో గ్రాఫర్స్ మంగళవారం మండల కేంద్రంలో సమావేశమై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఇట్టబోయిన వెంకటేష్, గౌరవ అధ్యక్షుడిగా కుమార్‌గౌడ్, ఫొటో గ్రాఫర్ గౌరవ అధ్యక్షుడిగా ఎం.నాగమౌళి, ఉపాధ్యక్షులు యం సాంబ, సిహెచ్ ఉపేందర్, ప్రధాన కార్యదర్శిగా ఎం.రమేష్, కోశాధికారిగా జి.ప్రదీప్, ఆర్గనైజర్‌గా కిషోర్‌కుమార్‌లు ఎన్నికయ్యారు.

నర్మెట మండల..

నర్మెట: మండల ఫొటోగ్రాఫర్స్ నూతన అధ్యక్షుడిగా గుండేటి రాంచందర్ ఎన్నికయ్యారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వలబోజు శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి కొంపెల్లి భాస్కర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా వలబోజు రమేష్, ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులు, కోశాధికారిగా లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా కృష్ణా రెడ్డి, సహాయకార్యదర్శిగా కంతి మహేష్, ఆర్గనైజర్‌గా బొడిక వినోద్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా అనిల్, సుధాకర్, రాజేష్, కార్తిక్, శ్రీకాంత్, అరుణ్ ఎన్నికయ్యారు.

దేవరుప్పుల మండల..

దేవరుప్పుల: మండల ఫొటో, వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ నూతన కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఇనుముల నాగరాజు, నోముల సతీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే గౌరవ మండల అధ్యక్షుడిగా బండారి యాదగిరి, ఉపాధ్యక్షుడిగా నల్ల సతీష్, కార్యదర్శిగా రెడ్డి రాజుల శ్రీకాంత్, కోశాధికారిగా బానోత్ సంతోష్, జనగామ జిల్లా ముఖ్య సలహాదారులుగా అమృతం ఆంజనేయులు, జిల్లా కార్యవర్గ సభ్యులుగా గుగులోత్ నరేందర్ నాయక్, కుటుంబ భరోసా అధ్యక్షుడిగా బానోత్ వీరునాయక్ ఎన్నికయ్యారు.